Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 196 | Sunday : 13.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :196 | ఆదివారం 13 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

# మళ్లీ సీనియర్లకు కాల్

- ప్రస్తుత మంత్రి వర్గంలో దాదాపు పది మందిపై అసంతృప్తిలో ఉన్నారని తెలిసి సీనియర్ నేతలలో ఆశలు
- ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎప్పుడు బాధ్యతలను స్వీకరించినా ఖచ్చితంగా కొందరు కేబినెట్ లో ఉంటారు. గత మూడు సార్లు అదే జరిగింది
- 1995, 1999, 2014 లో చంద్రబాబు కాబినెట్ ఆ ఫేస్ లే ఎక్కువగా కనిపిస్తాయి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కాకినాడ**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత మంత్రి వర్గంలో దాదాపు పది మందిపై అసంతృప్తిలో ఉన్నారని తెలిసి సీనియర్ నేతలలో ఆశలు పెరిగాయి. మార్పులు తప్పవని మొన్న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు, వార్నింగ్‌ల తర్వాత మళ్లీ పెద్దోళ్లలో ఆశలు పెరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియారిటీ అని పక్కన పెట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎప్పుడు బాధ్యతలను స్వీకరించినా ఖచ్చితంగా కొందరు కేబినెట్ లో ఉంటారు. గత మూడు సార్లు అదే జరిగింది. 1995, 1999, 2014 లో చంద్రబాబు కాబినెట్ ఆ ఫేస్ లే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ 2024 ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ కూర్పులో కొత్త ముఖాలకు చోటు కల్పించారు. సీఎం అంటే అదేనంటూ... చంద్రబాబు మంత్రివర్గం సమావేశంలో మరొక మాట కూడా అన్న విషయాన్ని సీనియర్ నేతలు గుర్తు చేస్తున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని తనలో చూస్తారని చంద్రబాబు చెప్పడాన్ని బట్టి చూస్తే నాటి నుంచి అనేక మంది మంత్రులు యాక్టివ్ గా ఉండేవారు. మీడియా సమావేశాలు ఎప్పటికప్పుడు పెడుతూ అప్పటి ప్రతిపక్షాలపై విమర్శలు తీవ్ర స్థాయిలో చేసేవారు. సబ్జెక్ట్ పై అవగాహన ఉండటంతో అనర్గళంగా మీడియా అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పేవారు. నీటిపారుదల శాఖ కాని, హోంశాఖ కానీ, విద్యుత్తు శాఖ కానీ, వ్యవసాయ శాఖ, ఆర్థిక శాఖ ఇలా అన్ని శాఖలపై - మిగతా 3లో



## మన దేశ శక్తులు అవే

- 'మీరు నూతన ప్రయాణం సాగిస్తున్న తరుణంలో మిమ్మల్ని అభినందిస్తున్నాను
- భారతదేశానికి రెండు శక్తులు ఉన్నాయని ప్రపంచం భావిస్తోంది
- అవి ఇక్కడి జనాభా, ప్రజాస్వామ్యం
- నేను ఇటీవలే ఐదు దేశాల పర్యటన నుండి తిరిగి వచ్చాను : ప్రధాని మోదీ

### ఈనెల 15 16 సీఎం చంద్రబాబు

# ఢిల్లీ పర్యటన

- అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీకానున్న ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై వారితో చర్చించనున్న సీఎం
- మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభ, సీఐఐ బిజినెస్ మీట్ లో పాల్గొననున్న సీఎం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ నెల 15,16వ తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ సహా వేర్వేరు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపడుతోన్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర గ్రాంట్లపై సీఎం వారితో చర్చించనున్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం తన ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు జరుపనున్నారు. 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న - మిగతా 3లో

## జనసేన నుంచి శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ వినుత బహిష్కరణ

- ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయి
- ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది.
- గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు జనసేన హై కమాండ్ తెలిపింది.





## కుర్చీ అంత ఈజీగా దొరకదు

- చిక్కితే వదలొద్దు: డీకే శివకుమార్
- కుర్చీని సంపాదించడం అంత ఈజీ కాదు
- ఒకవేళ దొరికితే మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోవద్దు
- మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## తెలంగాణలో రెండురోజులు వానలు

25 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ



## అప్పుడే తుది నిర్ణయానికి రావొద్దు

- తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాలి
- విమాన ప్రమాదంపై ఇది ప్రాథమిక నివేదిక మాత్రమే
- మంత్రిత్వ శాఖలో దీనిపై మేం విశ్లేషిస్తున్నాం

## కాళేశ్వరం కూలిపోయిందని ఊరికే బద్నాం చేస్తున్నారు

"వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి

మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు

మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది

మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయి?



## ఇద్దరు మంత్రులకు సోదరుడు రాజాని
## పరిచయం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
గంగాధర్ నెల్లూరు మండలం గంగాధర్ నెల్లూరు మండల కేంద్రం పరిధిలో నూతన అన్న క్యాంటీన్‌కు భూమి పూజ చేసిన చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు జీడి నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పూజ చేశారు. అనంతరం నెల్లెపల్లి గ్రామంలో సుపరిపాలనకు మొదటి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇద్దరు మంత్రులకు నా సోదరుడు రాజా అని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వారికి పరిచయం చేశారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ రాజాతో కొంతసేపు సరదాగా మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ తామస్‌కు అండగా ఉండి తెలుగుదేశం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు ఎమ్మెల్యేకు మంచి పేరు తేవాలని రాజా కు తెలియజేశారు.

## ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జులై 12:**
సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ పై వెలసిఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సత్య ప్రమాణాల కోసం పలువురు తరలి వచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు, ఉదయాన్నే ఆలయప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ప్రసన్న ఆంజనేయస్వామిలకు విశేషాభిషేకము అలంకరణ గావించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 12:**
స్థానిక రుక్మిణి సత్యభామసమేత వేణు గోపాలస్వామి ఆలయంలో శనివారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వశిష్టాచార్యులు, ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామిఅమ్మ వార్లకు విశేషాలు అలంకరణ గావించారు. పట్టణం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులుతరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారందరికీ పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## నేడు మాజీమంత్రి పెద్దిరెడ్డి చౌడేపల్లికి రాక



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
రాష్ట్రమాజీమంత్రి పుంగనూరుఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఈనెల 13న చౌడేపల్లికి రానున్నట్లు వైకాపా మండల అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి తెలిపారు. పట్టణంలోని బైసాని కళ్యాణ మండపంలో మధ్యాహ్నం2గంటలకు బాబు షూరిటీ.... మోసంగ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి శాసన సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ముఖ్యఅతిథిగా వస్తున్నారన్నారు. మండ లంలోని వైసీపీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పెద్దిరెడ్డి అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు, ఈ మేరకు బైసాని కళ్యాణమండపంలోని పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ చిత్తూరు రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల యువత అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు వైకాపా విద్యార్థి సంఘం విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ జిల్లా ఈవెన్ సెల్ కార్య నిర్వహణ కార్యకర్త పవన్ రాయల్ మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మంజునాథ్ రాము,వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు15నుండి ఆర్టీసీ బస్సుల్లో
## మహిళలకు ఉచిత ప్రయాణం
### ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
అన్నమయ్య జిల్లా పీలేరు వచ్చేనెల 15 నుండి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి పట్టణంలో ప్రజాప్రతినిధులు కూటమి శ్రేణులు నాయకులు కార్యకర్తలు మహిళలు పూలమాలలు, శాలువలు, హారతులతో ఘనస్వాగతంపలికారు. అయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించి మరో హామీ నెరవేర్చ నుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టినకార్యక్రమాలు, అందజేసిన సంక్షేమ పథకాలు,సాధించిన విజయాలు తెలియజేసి. త్వరలో కూటమి ప్రభుత్వంచేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఆర్టీసీ నల్ల గుట్ట ప్రాంతంలో ప్రజలు కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్థానిక సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉన్నతా ధికారులను ఆయన సూచనలు చేశారు.

## జగన్మోహన్ రెడ్డి ఏదైనా రాద్ధాంతం చేయాలంటే అసెంబ్లీలో ప్రస్తావించండి...

**ఇన్చార్జ్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి**
**నెల్లెపల్లి పంచాయతీలో సుపరిపాలనకు ముందడుగు**
**ఇద్దరు మంత్రులు ఎంపీ ఎమ్మెల్యే**



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 12:**
జగన్మోహన్ రెడ్డి నువ్వు ఏదైనా ప్రశ్నించాలన్నరాద్ధాంతం చేయాలన్నాఅసెంబ్లీలో వచ్చి మాట్లాడు దానికిమేము సరైన సమాధానం చెప్తాం, అంతేగాని ఇలా రోడ్లపైన వచ్చి మామిడి పంటను రోడ్డుపాలు చేసి రాద్ధాంతాలు చేస్తే ఇక కుదరదు అని చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం గంగాధర్ నెల్లూరు మండలం నెల్లెపల్లి దళితువాడలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో చిత్తూరు ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ విప్ జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీ దుర్గమల్ల ప్రసాదరావు పాల్గొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ప్రతిఇంటికి వెళ్లి గ్రామస్తుల సమస్యలను అడిగితెలుసుకున్న మంత్రులు ఎమ్మెల్యేలు. .అంతకు ముందు యాదవ సాధికారసమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పండ్ల గజ మాల కూరగాయలతో గజమాల ద్వారా మంత్రులకు ఎమ్మెల్యేలకు ఎంపీకి ఘనంగా సత్కరించారు అనంతరం మంత్రులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్నది. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు ఈ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని నెమరు చేసుకుంటున్నాం, జగన్మోహన్‌రెడ్డి అనే వ్యక్తికి ఇంకిత జ్ఞానం ఉందా అని అడుగుతున్నాం, మూడు రోజుల క్రితం చిత్తూరు పర్యటనకు వచ్చి రాద్ధాంతం చేసి యుద్ధవాతావరణంలో తలపించే లా మామిడి పంటను రోడ్డు పాలు చేసి నాశనం చేశారు. నీకు ప్రతిపక్ష నాయకుడిగా ఆ హోదా కూడా దక్కలేదు. గతంలో గుంటూరు మిర్చియార్డ్కి వెళ్లావు నీతో పాటు దొంగలను తీసుకెళ్లావ్ అక్కడ మిర్చి బ్యాగులను దొంగతనం చేయించా వు, పొగాకు యార్డ్ కి వెళ్లావు అక్కడున్న పొగాకు పంటను తొక్కించి నాశనం చేశా వు,మేం సవాల్ విసిరుతు న్నాం చంద్రబాబు నాయకత్వంలో మామిడి పంట రైతుల కు న్యాయం జరిగింది. గత సంవత్సరం మామిడి పంట 2.5 లక్షల మెట్రిక్ టన్నులు ఈ సంవత్సరం ఏడులక్షలమెట్టు కు టన్నులు మామిడి పంట వచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రి ఢిల్లీలో ఉండి మామిడి రైతుల కోసం 250 కోట్లునిధులు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయు డుది, ఇలాగే నువ్వు రాద్ధాంతంచేస్తా ఉంటే నీకుయాత్రఉండదు ఇక తీర్థయాత్ర గతి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కామెంట్స్ ఓటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 13 వేల రూపాయలు జమ అయ్యింది. దేశ చరిత్రలు ఎప్పుడు కూడా పదివేల కోట్లు తల్లికి వందనం కింద ఇచ్చిన, చరిత్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకే దక్కింది. కూటమి ప్రభుత్వం 80 శాతం మామిడి పంట కొనుగోలు చేసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఇక్కడకు వచ్చి మామిడికాయలను రోడ్డుపై పోసి రాద్ధాంతం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు.అనంతరం మిట్టపల్లి గ్రామంలో నూతన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాద వ్ మండల పార్టీఅధ్యక్షుడు స్వామిదాస్ జిల్లా టిడిపి నాయకు లు కృష్ణం నాయుడు, పుష్పరాజ్, పాలసముద్రం మండలం టిడిపి సీనియర్ నాయకుడు తాళ్లూరి శివ, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోదరుడు రాజా, సాఫ్ట్వేర్ బాలు, నియోజకవర్గ సిసి ఎల్ కార్యదర్శి కుమార్ ఆర్టీజిల్లా అధ్యక్షుడు జయరాజ్ లోకే ష్ నరేష్,మాజీ సర్పంచ్ కుప్పయ్య మండల ఎస్సీ సెల్ కార్యదర్శి నాగరాజు మధు, దేవర గుడిపల్లి రాజా, నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

## పీఈఎస్ మెడికల్ కాలేజీ చే
## ఉచిత కంటి చికిత్స డయాబెటిక్ శిబిరం




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ మరియు పీ ఈ ఎస్ మెడికల్ కాలేజీ చే ఉచిత కంటి చికిత్స డయాబెటిక్ శిబిరం నిర్వహించడం జరిగింది. దాదాపు వంద మంది ఇందులో పాల్గొన్నారు. 27 మందికి ఉచిత కంటి శాస్త్ర చికిత్సకు ఎంపిక చేసారు. అదే విధంగా శనివారం రోజు వైద్య శిబిరానికి వచ్చిన వారికీ ఇండియన్ గ్యాస్ డీలర్ అజిత్, వారి కుటుంబసభ్యులు భోజనాలు అందించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అడ్వైసర్ మహేష్ ,కార్యదర్శి సెంథిల్ కుమార్, కోశాధికారి చరణ్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, డైరెక్టర్స్ సెల్వం, డా.కృష్ణమూర్తి, ఆజాద్, లియో ఫ్యూచర్ కుప్పం ఇంజనీరింగ్ కాలేజ విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ కోర్డినేటర్ గంగాధర్ పిఈఎస్. వైద్య సిబంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఏడాది సుపరి పాలనకు తొలి అడుగు
## కార్యక్రమంలో పాల్గొన్న
## ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీస్ మునిరత్నం.



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
కుప్పం నియోజకవర్గం కుప్పం మున్సిపాలిటీలో 20 వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాను. భవిష్యత్తులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించాను. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశాను. అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యేంద్ర శేఖర్, సోము, ఉపేంద్ర, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులను సన్మానించిన
## టిడిపి యువనాయకుడు తాళ్లూరి శివ



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై12:**
చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్,విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఎంపీ దగ్గు మల్ల ప్రసాదరావును పాలసముద్రం మండలం టిడిపి యువ నాయకుడు ప్రకృతి షెల్టర్ చైర్మన్ తాళ్లూరి శివసాలువతో సన్మానించి సత్కరించారు. అనంతరం గంగాధర నెల్లూరు మండల కేంద్రంపరిధిలో 40లక్షల నిధులతో నూతన అన్నక్యాంటీన్‌కు చిత్తూరు ఇంచార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ విప్ జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీ దుర్గమల్ల ప్రసాదరావు భూమి పూజ చేశారు అలాగే మంత్రులకు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే అన్న క్యాంటీన్‌ను తొందరగా పూర్తి చేయాలనితెలిపారు.

## కూటమి ప్రభుత్వం చేసిన
## మంచి పనులను ప్రజలకు తెలియజేద్దాం.




**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
చేయవలసిన పనులపై ప్రత్యేక ద్రుష్టిసారిస్తా..మీడియా సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం. వరదయ్యపాలెం మండలంలోని యానాదివెట్టు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మీడియాసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలంటూ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. ప్రభుత్వం చేసే ప్రతి మంచిపనికి ప్రజల మద్దతు లభించాలని, నిస్వార్థంగా సేవలందించే నాయకులు, కార్యకర్తలు ప్రజల మనసు గెలవాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య, విద్య, రైతు, మహిళల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి. ప్రజలమద్దతు మనకు దక్కాలంటే,వారికి ప్రస్తుత పరిస్థితి చెప్పాలి," అని అన్నారు. ఇప్పటి వరకు అభివృద్ధినోచుకోని గ్రామాలు, పల్లెల్లోకి ఈసారి అభివృద్ధి చొచ్చుకు వచ్చిందని, దీనిని ప్రతి గృహానికి చేర్చడమే మన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొ న్నారు.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం శ్రేయస్సు కోరే ప్రతి నాయకుడు ప్రభుత్వ పథకాలపై అవగా హన కలిగించేందుకు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగ రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీ ప్రకాష్, జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్, జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీను, తదితర స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న
## మాజీ ఎమ్మెల్సీగౌని వారి శ్రీనివాసులు



**శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**
కుప్పం నియోజకవర్గం అబకల దొడ్డి, తుమ్మిసి పంచాయతీలలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ పివి నాగరాజు, స్థానిక తెలుగుదేశం నేతలతో కలిసి ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన పరిపాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు అనంతరం మాజీ ఎమ్మెల్సీగౌని వారి శ్రీనివాసులు మాట్లా డుతూ, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో అధికారం చేపట్టే సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు. ఇందులో భాగంగానే భాగంగానేఇంటింటికి సర్వే నిర్వహించి ప్రజలఅభిప్రాయాలను సేకరిస్తున్నామని అన్నారు ప్రభుత్వ పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న ముఖ్య ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఈ సర్వేకి శ్రీకారంచుట్టినట్లు పేర్కొన్నారు.

## అన్నమయ్య జిల్లా వైయస్సార్ యూత్ ప్రెసిడెంట్ గా
## పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 12:**
అన్నమయ్యజిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మండలఎస్టీసెల్ అధ్యక్షులుగా మునీంద్ర అలియాస్ కాలనీ చిన్నలకు నియామక పత్రాలను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అందజేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హరీష్ రెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# రాజాసింగ్ ఫ్యూచర్ ప్లాన్ ఏంటీ



**హైదరాబాద్ :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ను భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. దీంతో రాజాసింగ్ భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే రాజాసింగ్ రాజీనామా చేసినప్పుడు ఆల్టర్నేటివ్ ప్లాన్ సిద్ధం చేసిపెట్టుకున్నట్లు సమాచారం. ఇటీవల బీజేపీ అధ్యక్ష పదవి కోసం రాజాసింగ్ తాను కూడా పోటీ చేసేందుకు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిపుడు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారంటూ ఆయన పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ సమర్పించారు. దీంతో పాటు పార్టీ అధ్యక్షుడిగా రామచందర్ రావు ఎంపికపై కూడా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకుంది.తన రాజీనా మా లేఖను కిషన్ రెడ్డికి ఇచ్చారు. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించింది. .. అయితే రాజాసింగ్ పదకొండేళ్ల క్రితం బీజే పీలో చేరారు. వరసగా మూడు సార్లు రాజాసింగ్ కు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. దీంతో గోషామహల్ నుంచి మూడు సార్లు 2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే వరస వివాదాలు ఆయన కొని తెచ్చుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఆయనపై కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంలోనూ, ఎంఐఎంపై విరుచుకుపడటంలోనూ బీజేపీ నేతల కంటే రాజాసింగ్ ముందుటారు. హిందుత్వం కోసమే తాను పనిచేస్తున్నట్లు రాజాసింగ్ చెబుతారు. అయితే మొన్న రాజీనామా చేసిన సమయంలోనూ తాను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరబోనని, తనకు, ఆ పార్టీ సిద్ధాంతాలు పడవని తెలిపారు. బీజేపీలో చేరినా ఆయనకు తనకు పదవుల విషయంలో అన్యాయం జరిగిందని భావించారు. శాసనసభపక్ష పదవి కూడా ఆయనకు దక్కలేదు. అందుకు కారణం ఆయన ఎవరి మాటవినరు. తాను తప్ప మరెవ్వరూ హిందుత్వం కోసం పనిచేయరన్న భావనతో ఆయన ఉంటారు. తనకు మించిన హిందుత్వ వాది మరొకరు ఉండరని తనకు తానే అనుకుంటారు. అందుకే బీజేపీలో ఉన్న నేతలను కూడా లెక్కచేయరు.శాసనసభ పక్ష నేతగా పదవి దక్కకపోవడానికి కూడా రాజాసింగ్ వ్యవహార శైలి కారణమని, బీజేపీలో 90 శాతం మంది రాజాసింగ్ ను వ్యతిరేకిస్తారు కాబట్టి ఇటు ఆపదవితో పాటు అటు పార్టీలోనూ మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయినా ఎలాంటి పదవులు దక్కలేదు. ఇది వాస్తవం.... కానీ రాజాసింగ్ మాత్రం రాజకీయాల నుంచి దూరం జరిగే అవకాశం లేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన రాజీనామాను పార్టీ ఆమోదించడంతో ఇక తదుపరి ఎమ్మెల్యేపదవికి రాజీనామా చేస్తారంటున్నారు. ప్రస్తుతం రాజాసింగ్ అమర్ నాథ్ యాత్రలో ఉన్నారు. యాత్ర నుంచి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారంటున్నారు. అందుకు కారణం ఆయన శివసేనలో చేరతారంటున్నారు. శివసేనలో చేరి ఇక్కడ పార్టీ అభ్యర్థిగా ఉప ఎన్నికలో గెలిచి తన సత్తా ఏంటో గోషామహల్ లో చూపాలని రాజాసింగ్ సిద్ధమవుతు న్నారని తెలిసింది. అందుకే ఆయన తన రాజీనామా ఆమోదించిందని తెలిసిన వెంటనే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న కలతో పగలనక, రాత్రనక పనిచేస్తున్న లక్షలాది మంది బీజేపీ కార్యకర్తల బాధను తాను ఢిల్లీకి తెలియచేయలేకపోయినా, తాను హిందుత్వం కోసమే పనిచేస్తుంటానని, హిందూ సమాజ హక్కులకసం తన గొంతుక వినిపిస్తుంటానని ట్వీట్ చేయడం దీనికి బలం చేకూరుస్తుంది. అదేజరిగితే ఉపఎన్నికలు జరిగితే గోషా మహల్ లో బీజేపీకి కష్టకాలమేనని చెప్పాలి.

# కొండా అంశాన్ని ఏం చేద్దాం



**వరంగల్ :** మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈరోజు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తామని, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు... అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది. తమను దూషించిన వారిని వదిలేసి... అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లబ కొండా మురళిగా మారిపోయింది. ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది. క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ.ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

## ఇందిరమ్మ క్యాంటిన్లు...

-మొదటిపేజీ తరువాయి

హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ రూపొందించిన టిఫిన్ మెనూను అమలు చేయనున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మిల్లెట్ ఆహారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రోజుకో రకమైన అల్పాహారాన్ని.. అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందించనున్నారు. ఈ మెనూలో భాగంగా 6 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో రకం టిఫిన్ వడ్డించనున్నారు. మెనూలో ఉన్న టిఫిన్ లిస్ట్ రోజు వారిగా ఇలా ఉండబోతుంది.

1వ రోజు: మిల్లెట్ ఇడ్లీ (3), సాంబార్, చట్నీ/పొడి
2వ రోజు: మిల్లెట్ ఉప్మా, సాంబార్, మిక్స్ చట్నీ
3వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
4వ రోజు: ఇడ్లీ (3), సాంబార్, చట్నీ
5వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
6వ రోజు: పూరీ (3), ఆలూ కూర్మా

ఇందిరమ్మ క్యాంటీన్లలో వడ్డించే ప్రతి టిఫిన్‌కు సరిపోయేలా ఖచ్చితమైన గ్రాముల వారీగా పదార్థ పరిమాణాలూ నిర్ణయించారు. ఉదాహరణకి మిల్లెట్ ఇడ్లీ తీసుకుంటే.. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు, చట్నీ 15 గ్రాములుగా ఉండనుంది. ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం జీహెచ్ఎంసీ 139 ప్రాంతాల్లో కొత్త కంటైనర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.11.43 కోట్ల ఖర్చు చేయనున్నారు. ఈ క్యాంటీన్‌లలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యం. పేద, మధ్య తరగతి ప్రజల కోసం రూపొందించిన ఈ పథకం.. వారికి తక్కువ ధరకే ఆరోగ్యకరమైన అల్పాహారాన్ని అందించడంలో మైలురాయిగా నిలవనుంది అంటున్నారు అధికారులు.

## ఫోర్త్ సిటీటూ అమరావతి...
# కొత్త జాతీయ రహదారి

**హైదరాబాద్ :** తెలంగాణ నుంచి ఎగుమతులు, దిగుమతు లు సులభతరం చేసేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసు కుంటోంది. అందులో భాగంగా హైదరాబాద్ ఫోర్త్‌సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మాణం, అక్కడి నుండి మచిలీపట్నం పోర్టుకు రైలు మార్గం నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని తెలంగాణ అధికారులు ఏపీకి వివరించారు. వీటికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ఏపీ స్పందన కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా ఆధారిత అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఎగుమతులు, దిగుమతులను సులభతరం చేయడానికి కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే, డ్రైపోర్ట్–పోర్ట్ రైలు మార్గాల నిర్మాణాన్ని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంతో పాటు, ఏపీతో మెరుగైన అనుసంధానానికి మార్గం సుగమం చేయనున్నాయి. హైదరాబాద్ సమీపంలోని ఫోర్త్‌సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవల కేంద్ర హోంశాఖ నిర్వహించిన ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై జరిగిన సమావేశంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖకు సూచించింది.ప్రస్తుతం హైదరాబాద్–విజయవాడ మధ్య 65వ నంబరు జాతీయ రహదారి ఉంది. అయితే, కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేను హైదరాబాద్ నుంచి కాకుండా హైదరాబాద్‌కు భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న ఫోర్త్‌సిటీ నుంచి నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆలోచనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్అండ్‌బీ స్పెషల్ సీఎస్‌లతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చర్చించారు.అమరావతి–ఫోర్త్‌సిటీని కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తే ఇది విజయవాడ–హైదరాబాద్ ప్రస్తుత జాతీయ రహదారికి సమాంతర రోడ్డు అవుతుందని తెలంగాణ అధికారులు ఏపీ అధికారులకు వివరించారు. ప్రస్తుత జాతీయ రహదారికి అటూఇటూగా 10 కి.మీ. దూరంలో దీన్ని నిర్మిస్తే ప్రత్యేక బెల్ట్‌లా తయారవుతుందని చెప్పారు. మధ్యలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ ఎలైన్‌మెంట్‌పై ఆంధ్రప్రదేశ్ స్పందన కోసం తెలంగాణ సర్కార్ ఎదురుచూస్తోంది.తీరప్రాంతం లేకపోవడంతో ఓడరేవులు లేవు. దీంతో బియ్యం, చమురు, ఎరువులు, సిమెంటు వంటి వస్తువుల ఎగుమతులు, దిగుమతులకు వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి.

## ఈనెల 15 16 సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అదే రోజు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించనున్నారు.16వ తేదీన కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం నార్త్ బ్లాక్ లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ నుంచి అమరావతి బయలుదేరుతారు.

## జనసేన నుంచి శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ వినుత బహిష్కరణ

**శ్రీకాళహస్తి:** జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినుతను ఆ పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ మేరకు మీడియాకు జనసేన అధిష్టానం శనివారం లేఖ విడుదల చేసింది. వినుత వ్యవహార శైలి జనసేన విధి విధానాలకి భిన్నంగా ఉండటంతో ఆమెని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు జనసేన హై కమాండ్ తెలిపింది. ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయని గుర్తుచేసింది. ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది.

**ఏం జరిగిందంటే..**

కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ (రాయుడు)(24) చైన్నైలో దారుణ హత్యకి గురయ్యాడు. చెన్నై మిట్ రెడ్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో రాయుడు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. వినుత డ్రైవర్ రాయుడు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి రాయుడు నానమ్మ వచ్చింది. ఆమెని పోలీసులు విచారణ చేశారు. మూడు నెలలుగా రాయుడుకు వినుత కుటుంబ సభ్యులతో విభేదాలు ఉన్నాయని తెలిపింది. రాయుడు మృతికి వినుత కుటుంబ సభ్యులే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రాయుడు నానమ్మ ఫిర్యాదు మేరకు వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు, వినుత తండ్రి భాస్కర్‌లని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు ఈ కేసుని ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు.

## మళ్లీ సీనియర్లకు కాల్

-మొదటిపేజీ తరువాయి

అందరూ పట్టున్న వారే కావడంతో విపక్షాల విమర్శలకు దీటైన సమాధానం గణాంకాలతో చెప్పేవారు. అయితే ఇప్పుడున్న కొత్త మంత్రుల్లో కొందరు, సీనియర్ నేతలుగా ఉన్న మరికొందరు ఎందుకో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సీనియర్ నేతలకు ప్రాధాన్యత కలిగిన శాఖలను ఇచ్చినప్పటికీ వారు సరైన టైంలో సరైన రీతిలో స్పందించలేదన్న కొరవ చంద్రబాబు లో స్పష్టంగా కనపడుతుంది. అది ప్రతిపక్షానికి అడ్వాంటేజీగా మారుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. భయమా? లేక అవగాహన లోపమో? తెలియదు కానీ గత ఏడాది కాలంలో మంత్రివర్గంలో చాలా మంది మౌనంగానే ఉంటుండటం విపక్షానికి వరంగా మారింది. సవాల్ కు ప్రతి సవాళ్లు లేవు. అలాగే విపక్షం చేసే కౌంటర్లకు తిరిగి కౌంటర్ ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో చంద్రబాబు మార్చేయాలన్న యోచనకు వచ్చినట్లు చెబుతున్నారు.మార్పు ఎప్పుడన్నది తెలియకపోయినా .. మార్పు గ్యారంటీ అన్న సంకేతాలు మాత్రం బలంగా నేతల్లోకి వెళ్లాయి. చంద్రబాబు హెచ్చరికల తర్వాత కుర్ర మంత్రులు కొంత కలవరపడి స్పందిస్తున్నా అప్పటికే ఇచ్చిన సమయం దాటి పోవడంతో పాటు ఈ బ్యాచ్ తో ముందుకు వెళితే వచ్చే ఎన్నికల్లో నెగ్గుకు రావడం కష్టమేనని చంద్రబాబు అంచనాకు వచ్చారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అందుకే సీనియర్లను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకుని విపక్షాలకు ధీటుగా సమాధానం చెప్పడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో పెద్దోళ్లు మళ్లీ పంచెలు బిగించి పసుపు పార్టీలో యాక్టివ్ అవుతున్నట్లే కనిపిస్తుంది.

## రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రిని కలిసిన టిడిపి నాయకులు



**వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై12:** గంగాధర్ నెల్లూరు మండలం నెల్లపల్లిలో సూపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డా.వి.ఎం. థామస్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానిస్తున్న వెదురుకుప్పం టీడీపీ నేత మోహన్ మురళి మంత్రి దృష్టికి వెదురు కుప్పం జెడ్.పి.హై స్కూల్ గ్రౌండ్‌లో ఉన్న టువంటి విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని వినతిపత్రం అందజేసిన మోహన్ మురళి

## సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు

**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై12:**



గంగాధర నెల్లూరు నియోజకవర్గం నెల్లేపల్లి మిట్ట పంచాయతీ చిన్నమిట్ట పల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మంటపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్, జిల్లాయాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

**వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:**



శనివారం ప్రభుత్వ విప్, జీడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవి కుమార్,యువత క్రీడా శాఖా – జిల్లా ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో గంగాధర నెల్లూరు నియోజకవర్గం – సదరు మండలం నెల్లేపల్లి గ్రామంలో జరిగిన సుపరి పాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్ ముని చంద్రా రెడ్డి పాల్గొన్నారు.

## బిజినెస్

### డీమార్ట్‌లో తెగ షాపింగ్ చేస్తున్నారా?




డీ మార్ట్‌లో డిస్కౌంట్లు ఎక్కువగా ఉన్నాయని తెగ షాపింగ్ చేస్తున్నారా.? అయితే కొంచెం ఆగండి. ఈ వార్త చదివేయండి. ఈ ఒక్క పని చేస్తే.. డిస్కౌంట్లు కంటే ఎక్కువగా డబ్బు ఆదా చేయవచ్చు. డీమార్ట్.. బట్టలు, పండ్లు, నిత్యావసర వస్తువులు.. ఇలా దొరకని వస్తువు అంటూ ఏది ఉండదు. డిస్కౌంట్లు, 1o1 ఆఫర్లు లాంటివి పెట్టి కస్టమర్లను ఆకర్షిస్తుంది. ప్రతీ వారం నార్మల్‌గా ఇంటి షాపింగ్ చేయడం వరకు ఓకే.. ఆఫర్లు పెట్టారు కదా అని తెగ షాపింగ్ చేస్తుంటే.. ఓసారి ఇది చూడండి. డీమార్ట్‌లో ఆఫర్లు ఉన్నాయ్ కదా అని.. ఎగబడి కొనే బదులు.. డీమార్ట్ షేర్స్‌ను మీరు కొంటే.. డబ్బులు డబుల్ అవ్వడం ఖాయం. అదెలా అని అనుకుంటున్నారా.. ప్రస్తుతం డీమార్ట్(అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్) షేర్ రూ. 4070.20గా ఉంది. గత వారం రోజుల్లో అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితలు కారణంగా ఈ షేర్ ధర డ్రాప్ అవుతోంది. సుమారు రూ. 213.90 మేరకు తగ్గింది. మీరు ఈ షేర్‌లో ఇన్వెస్ట్ చేస్తే.. కేవలం ఆరు నెలలలోనే డబ్బులు డబుల్ అవ్వడం ఖాయం. ప్రస్తుతం షేర్ వాల్యూ డౌన్‌సైడ్ ఉన్నప్పటికీ.. కచ్చితంగా వచ్చే ఆరు నెలలలో ఇది మళ్లీ పెద్ద బుల్ రన్ ఇవ్వడం ఖాయం. అలాగే క్యూఓన్ ఫలితాలు వచ్చాక.. షేర్ కచ్చితంగా దూసుకుపోతుందని అనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. ఈ షేర్ 52 వీక్ హై నుంచి ప్రస్తుతం డౌన్ ట్రెండ్‌లో ట్రేడ్ అవుతోంది. కానీ మరో ఆరు నెలల్లోనే సరికొత్త 52 వీక్ హై టచ్ అవ్వడం ఖాయం అని చెబుతున్నారు. డీమార్ట్ గత 52 వీక్ హై 5484.85గా ఉంది.

### 8 బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఝలక్




ఆరోగ్య బీమా పాలసీల సెటిల్‌మెంట్స్ లోపాలపై బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఎనిమిది బీమా కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ కంపెనీలన్నీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి గత ఏడాది మే నెలలో తాము జారీ చేసిన 'హెల్త్ ఇన్సూరెన్స్ మాస్టర్ సర్క్యులర్' నిబంధనలు తుంగలో తొక్కాయని పేర్కొంది. ప్రైవేట్ రంగంలోని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, మణిపాల్‌సిగ్మా హెల్త్ ఇన్సూరెన్స్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీకి కూడా ఈ నోటీసులు అందాయి. వచ్చే వారం చర్చ: ఈ నోటీసులకు ఇప్పటి వరకు ఐసీఐసీఐ లొంబార్డ్, న్యూ ఇండియా అష్యూరెన్స్ మాత్రమే సమాధానం ఇచ్చాయి. మిగతా కంపెనీలు ఇంకా సమాధానం ఇవ్వాల్సి ఉంది. వచ్చే వారం జరిగే ఐఆర్‌డీఏఐ బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు రానుంది. బీమా కంపెనీలు ఇచ్చిన సమాధానాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారు. జరిమానాలు లేదా పాలసీదారులకు వడ్డీతో సహా క్లెయిమ్స్ రిఫండ్ చేయమని ఆదేశించే అవకాశం ఉందని భావిస్తున్నారు

### పి.ఇ.ఎస్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో

# అత్యాధునిక కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య సేవలు.

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:** పి.ఇ.ఎస్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగం ప్రఖ్యాత వైద్య నిపుణులు డాక్టర్" మయూర్ వికాకు ఆధ్వర్యంలో అతితక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం పద్ధతులతో కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆసుపత్రి యాజ మాన్యం తెలియజేసింది.బెంగళూరు, ముంబాయివంటి మహానగరాలలో లభిం చే అత్యాధునిక వైద్య సేవలు ప్రస్తుతం కుప్పం పి.ఇ.ఎస్. ఆసుపత్రిలో అతితక్కువ ఖర్చుతో లభిస్తుండటంతో వైద్యులయొక్క చిరునామా తెలుసుకొని రోగులు బెంగుళూరు, బిధర్, ముంబాయి వంటి ప్రాంతాల నుండి వచ్చి వైద్యసేవలు పొందుతున్నట్లు వైద్యులు డాక్టర్"మయూర్ తెలియ జేశారు.అలాగే బెంగళూరు నుండి వచ్చిన వ్యక్తికి మెదడు క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించి బాగు చేయబడినది, ముంబాయి నుండి వచ్చిన జ్యోతిఅనే వ్యక్తి వెన్నెముక నొప్పితో బాధపడుతూ కదలలేనిస్థితిలో ఉండ డంతో అతి తక్కువ ఖర్చుతో వెన్నెము కఆపరేషన్ చేసుకొని పూర్వస్థితిని పొంది ఆరోగ్యంగా ఉన్నట్లు అలాగే 11సంవత్స రముల గోకుల్ మేడపై నుండి పడిపోవడంతో డీప్ కోమారి మెదడు పనిచేయ లేని స్థితిలో రావడంతో అతనికిస్కాన్ నిర్వహించి, మెదడులో 200 రక్తస్రావం ఉన్నట్లు గుర్తించి వెంటనే సర్జరీ నిర్వహించడంతో ప్రస్తుతంబాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు, జయమ్మ వ్యక్తికి మెదడు మధ్య భాగంలో కణితి ఉండడంతో తలనొప్పి మైకం వంటి సమస్యలతో బాధపడుతూ వివిధ ప్రదేశా లలో చూపించడం. ఇందుకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలపడంతో ఆ వ్యక్తిని పరిశీలించిన న్యూరో సర్జరీ వైద్యులు డాక్టర్" మయూర్ అతి సూక్ష్మ మైక్రోస్కోపీ పద్ధతి లో సర్జరీ నిర్వహించి, టెఫ్లాన్ కోటింగ్ అమర్చినట్లు ఇటువంటి శస్త్ర చికిత్సకు కార్పొరేట్ ఆసుపత్రులలో సుమారు పది లక్షల ఖర్చు అవుతుందని దీనిని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి





ఉచితంగా శాస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్" మయూర్ మాట్లా డుతూ పెద్ద పెద్ద నగరా లలో కార్పొరేట్ ఆసుపత్రులలో నిర్వహిం చే అతి ఖరీదైన అరుదైన శస్త్రచికిత్సలను ఇప్పుడు కుప్పం పి.ఇ.ఎస్. స్పెషాలిటీ ఆసుపత్రిలో అతితక్కువఖర్చుతో, ఎన్టీ ఆర్ వైద్యసేవద్వారా వైద్య సేవలు అంది స్తున్నట్లు తెలియజేశారు.ఇలాంటి అరు దైన శస్త్రచికిత్సలను ప్రజలకు అందుబాటులో అతి తక్కువ ఖర్చుతో నిర్వహి స్తున్న న్యూరో సర్జరీ వైద్యులు డాక్టర్" మయూర్ ని ఆసుపత్రి యాజమాన్యం అభినందించినట్లు మెడికల్ సూపరింటిం డెంట్ డా. సుబ్రహ్మణ్యం ఎన్.కె. తెలియ జేసారు.అలాగే ప్రమాద ఇతర న్యూరో సర్జరీ సంబంధిత శస్త్రచికిత్సలను వ్యయ ప్రయాసలతో సుదూరప్రాంతాలకు వెళ్ల కుండా పి ఇ ఎస్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పొందవచ్చునని తెలియజేశారు.

### ఏసియన్ సిల్క్స్ షోరూమ్ లో ఆషాడ మాసంలో

# పట్టు చీరలపై ప్రత్యేక తగ్గింపు ధరలు.

**హిందూపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 12:** శ్రీసత్యసాయిజిల్లా హిందూపురం పట్టణం ముదిరెడ్డిపల్లిలోని ఏసియన్ సిల్క్స్ షోరూమ్‌లో ఆషాడం మెగా సేల్ ఈ నెల రెండవ తేదీ నుంచి నెలాఖరు వరకు ఆషాడం సేల్ మొదలైందని ఏసియన్ సిల్క్స్ అధినేతలు ఏ.సీ.నాగరాజు, ఏ.ఎన్. మురళీకృష్ణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకముల పట్టు చీరల మీద 30 శాతం నుండి 50 శాతం వరకు వినియో దారులకు ప్రత్యేక తగ్గింపు ధరలు ఇస్తున్నట్లు తెలిపారు.ఫ్యాన్సీ చీరల మీద 30 శాతం వరకు, సెలెక్టెడ్ పట్టు చీరల మీద ఒకటి కొంటే ఒకటి ఉచితముగా వినియోగదారులకు అందిస్తున్నట్లు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఏసియన్ సిల్క్స్ గత 50 ఏళ్లుగా ఇటు వంటి ప్రత్యేక ఆఫర్లు వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు.గడచిన యేడాది తమ షోరూమ్ స్వర్ణోత్సవ వేడుక జరుపుకొందని దానికి కారణం తమ వినియోగదారుల ఆదరాభిమానాలేనని హర్షం వ్యక్తం చేశారు. ఏసియన్ సిల్క్స్ షో రూమ్ వినియోగదారులకు మూడు తరాలుగా నాణ్యమైన మన్నికైన పట్టుచీరలు అందించడమే కారణమన్నారు. ఇలాంటి నాణ్యత మన్నికగల, నమ్మకమైన పట్టుచీరలురాబోవు వారసత్వ తరాలు అందించాలనేలక్ష్యమే తమ సంస్థ ఆకాంక్ష అన్నారు. ఎప్పటి కప్పుడు సరికొత్త డిజైన్లతో యువతులకు, మధ్య వయస్కులకు, వృద్ధ మగువకు తమకు నచ్చిన విధంగా పట్టుచీరలు తయారు చేయడమే ఏసియన్ సిల్క్స్ ప్రత్యేకం అన్నారు. ఆర్ట్ సిల్క్స్,ఆఫ్ కంచి, సాఫ్ట్ సిల్క్స్, కంచి పట్టు,ఉప్పడ పట్టు, ఫ్యాన్సీ బనారస్, పోచంపల్లి తదితర పట్టుచీరలు ఏసియన్ సిల్క్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు. బెంగళూరు, చెన్నై, ముంబై మహా నగరాలలో ఉన్నటువంటి సెంట్రాల్ ఏసీ, లిఫ్ట్ సిస్టం, విశాలమైన మూడు అంతస్తుల భవనంలో ప్రశాంతమైన వాతావరణంలో చీరల ఎంపికచేసుకోవడానికి వినియో గదారులకు సౌకర్యం కల్పించడమే ముద్ది రెడ్డిపల్లిలో వున్న ఏకైక షోరూం ఏసియన్ సిల్క్స్ అని తెలిపారు. తమ ఎసియన్ సిల్క్స్ మూడు తరాల కుటుంబాల విని యోగదారులు పక్కకుమరలకుండా తమ సంస్థ మీద ఆదరాభిమానాలు చూపిస్తు న్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. వినియోగదారులు ఎక్కడి నుండి వస్తున్నారన్న ప్రశ్నకు వారు సమా ధానమిస్తూ ఇండియాలో ఉన్న మహా నగ రాలతో పాటు దేశ విదేశాల నుండి కూడా తమ కస్టమర్లు తరలివచ్చి పట్టుచీరలు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఏసియన్ సిల్క్స్ లాభాపేక్షతో కాకుండా నాణ్యమైన, మన్నికైన, నూటికి నూరుశాతంపట్టు చీరలు నమ్మకంతో అందించడమే ఇంత అభివృద్ధికి సాధ్యమైందని ఏసీ నాగరాజు, ఏ.ఎన్.మురళీకృష్ణ ఘంటాపథంగా చెబుతున్నారు.

## స్పోర్ట్స్

### చరిత్ర సృష్టించిన శుబ్‌మన్ గిల్..

# కోహ్లీ ఆల్‌టైమ్ రికార్డు బద్దలు

టీమిండియా నయా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్ గడ్డ మీద ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆసియా కెప్టెన్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఈ క్రమంలో భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును గిల్ బద్దలు కొట్టాడు. ాగా టెండుల్కర్- ఆండర్సన్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు ఆడేందుకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే.




**టెస్టు సారథిగా అరంగేట్రంలోనే సెంచరీ**

ఇక ఈ సిరీస్ ద్వారానే టీమిండియా టెస్టు కెప్టెన్‌గా యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ తన ప్రయాణం మొదలుపెట్టాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఈ కుడిచేతి వాటం బ్యాటర్ కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి భారీ శతకం (147) సాధించాడు. తద్వారా టెస్టు జట్టు సారథిగా తొలి ప్రయత్నంలోనే సెంచరీ చేసి అనేక రికార్డులను గిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక అదే మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో గిల్ కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేసి నిష్క్రమించాడు. అయితే, ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో మాత్రం గిల్ తన విశ్వరూపం చూపించాడు.

**డబుల్ సెంచరీ, శతకంతో చెలరేగి**

తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా భారీ డబుల్ సెంచరీ (269)తో దుమ్ములేపిన ప్రిన్స్.. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకం (161) సాధించాడు. తద్వారా ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత ఆటగాడు, కెప్టెన్‌గా గిల్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును తిరగరాశాడు. ఇక తాజాగా లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్టులో గిల్ స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 44 బంతులు ఎదుర్కొన్న కెప్టెన్ సాబ్.. రెండు ఫోర్ల సాయంతో కేవలం 16 పరుగులే రాబట్టాడు. శుక్రవారం నాటి రెండో రోజు ఆటలో భాగంగా ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి గిల్ పెవిలియన్ చేరాడు.

**ఆసియా తొలి కెప్టెన్‌గా..**

అయితే, మూడో టెస్టులో గిల్ విఫలమైనప్పటికీ.. అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికి ఐదు ఇన్నింగ్స్ మాత్రమే ఆడిన గిల్ ఏకంగా 601 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇంగ్లండ్ గడ్డ మీద ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆసియా తొలి కెప్టెన్‌గా గిల్ ప్రపంచ రికార్డు సాధించాడు. అంతకుముందు కోహ్లీ పేరిట ఈ రికార్డు ఉండేది.

ఇంగ్లండ్ గడ్డ మీద ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆసియా కెప్టెన్లు వీరే

శుబ్‌మన్ గిల్ (ఇండియా)- 601౬ రన్స్- 2025లో..
విరాట్ కోహ్లీ (ఇండియా)- 593 రన్స్- 2018లో..
మహ్మద్ అజారుద్దీన్ (ఇండియా)- 426 రన్స్- 1990లో..
జావేద్ మియాందాద్ (పాకిస్తాన్)- 364 రన్స్- 1992లో..
సౌరవ్ గంగూలీ (ఇండియా)- 351 రన్స్- 2002లో...

ఇక ఓవరాల్‌గా ఇంగ్లండ్ గడ్డ మీద ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన కెప్టెన్ల జాబితాలో... గిల్ మూడో స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజం అలెన్ బోర్డర్ (597)ను గిల్ అధిగమించాడు. ఇక ఈ లిస్టులో గ్యారీ సోబర్స్ (722), గ్రేమ్ స్మిత్ (714) గిల్ కంటే ముందు వరుసలో ఉన్నారు.

### కేఎల్ రాహుల్, గిల్ తప్పుల వల్లే ఇలా జరిగింది:

### ఇర్ఫాన్ పఠాన్ ఆగ్రహం

కేఎల్ రాహుల్ పొరపాటుతో పాటు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తీసుకున్న నిర్ణయం వల్లే ప్రత్యర్థిని నామమాత్రపు స్కోరుకు నిలువరించే వీలు లేకపోయిందని ఇర్ఫాన్ పఠాన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాగా లార్డ్స్ వేదికగా భారత్- ఇంగ్లండ్ మధ్య గురువారం మూడో టెస్టు మొదలైంది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బ్యాటింగ్ చేసి.. మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయింది. అయితే, 251/4 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం నాటి రెండో రోజు ఆట మొదలుపెట్టిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. బెన్ స్టోక్స్ (44), క్రిస్ వోక్స్ (0), సెంచరీ వీరుడు జో రూట్ (104)లను భారత పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రా త్వరత్వరగానే పెవిలియన్ చేర్చాడు. ఇలాంటి దశలో వికెట్ కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ (51), టెయిలెండర్ బ్రైడన్ కార్స్ (56) అద్భుత హాఫ్ సెంచరీలతో చెలరేగి.. జట్టుకు మెరుగైన స్కోరు అందించారు. నిజానికి జేమీ స్మిత్ ఐదు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను కేఎల్ రాహుల్ నేలపాలు చేశాడు. మరోవైపు.. రెండో రోజు ఆటలో కేవలం 63 డెలివరీలు సంధించిన తర్వాతనే బంతిని




మార్చాలంటూ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ పట్టుబట్టాడు. అప్పటికి బుమ్రా ఆ బంతితో బాగానే రాణిస్తున్నా.. గిల్ అంపైర్‌తో వాదనకు దిగి మరీ బంతిని మార్పించాడు. అయితే, దురదృష్టవశాత్తూ పాత బంతి కంటే అంపైర్ ఇచ్చిన కొత్త బంతి మరింత వాడినదానిలా ఉండటంతో టీమిండియాకు షాక్ తగిలింది. మొమెంటమ్ మారిపోయింది. ఈ నేపథ్యంలో ఇర్ఫాన్ పఠాన్ మాట్లాడుతూ.. "రెండోరోజు టీమిండియా చేసిన రెండు తప్పిదాల వల్ల ఇంగ్లండ్‌ను త్వరగా ఆలౌట్ చేసే అవకాశం చేజారింది. కేఎల్ రాహుల్ జేమీ స్మిత్ క్యాచ్ జారవిడవడమే అన్నిటికంటే పెద్ద తప్పు. అక్కడే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. స్మిత్ ఐదు పరుగుల వద్ద ఉన్నప్పుడు రాహుల్ క్యాచ్ మిస్ చేశాడు. ఆ తర్వాత అతడు బ్రైడన్ కార్స్‌తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. ఒకవేళ రాహుల్ గనుక అప్పుడే క్యాచ్ అందుకుని ఉంటే ఇలా జరిగేది కాదు. ఇక రెండోది... అసలు బంతిని మార్చమని ఎందుకు అడిగారో అర్థం కాలేదు. అప్పటికే తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు తీశారు. అలాంటపుడు బంతిని మార్చాల్సిన అవసరం ఏముంది?

### మనం నియంత్రించలేం..

### నా మ్యాచ్ ఫీజును పోగొట్టుకోలేను: బుమ్రా




ఇంటర్నెట్ డెస్క్: ఇప్పుడందరి నోళ్లల్లో 'బంతి మార్పు' అంశమే నానుతోంది. మాజీ క్రికెటర్ల నుంచి ప్రస్తుతం ఇంగ్లాండ్ – భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఆటగాళ్ల వరకూ అందరూ దీని పైనే కామెంట్లు చేస్తున్నారు. మరి లార్డ్స్‌లో ఐదు వికెట్లు తీసిన జస్‌ప్రీత్ బుమ్రా ఎదుట కూడా ఇదే ప్రశ్న ఎదురుకాకుండా ఉంటుందా? ఈవిషయాన్నే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విలేకర్లు అడిగేశారు. అయితే, బుమ్రా ఇచ్చిన సమాధానం హాస్యభరితంగా ఉండటం గమనార్హం. "బంతిలో మార్పులను నియంత్రించడం కష్టమే. అయితే, ఈ అంశంపై మాట్లాడి నేను నా సొమ్మును పోగొట్టుకోవాలని అనుకోవడం లేదు. చాలా కష్టపడి ఆడా. చాలా ఓవర్లు బౌలింగ్ వేశా. కాబట్టి, ఎలాంటి వివాదాస్పద స్టేట్‌మెంట్లు ఇవ్వదల్చుకోలేదు. అలాగే మ్యాచ్ ఫీజును కోల్పోదల్చుకోలేదు. మనం మార్చలేం. అలాగే పోరాడలేం. కొన్నిసార్లు మనకు అనుకూలంగా నిర్ణయాలు రావు. మరికొన్నిసార్లు వస్తుంటాయి" అని వ్యాఖ్యానించాడు. అదే సమయంలో ఓ రిపోర్టర్ ఫోన్ మోగడంతో స్పందించిన బుమ్రా 'ఎవరి భార్యో ఫోన్ చేస్తున్నారు' అనడంతో అంతా నవ్వేశారు. మేమంతా బుమ్రా ఏం చెబితే అదే ఫాలో అవుతామని తొలిరోజు అనంతరం యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పాడు. ఆ మాటలను బుమ్రా ఎదుట ప్రస్తావించగా.. సరదాగా స్పందించాడు. "అసలు నితీశ్ చెప్పిన ఆన్సర్ తప్పు. అతడు నన్నేమీ అడగలేదు. అయితే, ఈ యువ క్రికెటర్ చాలా ఆత్మవిశ్వాసంతో ఉంటాడు. మా నుంచి ఇలాంటి కుర్రాళ్లకు మరింత గైడెన్స్ అవసరం లేదు. నా అవసరం ఎప్పుడు ఉన్నా వారికి తప్పకుండా అందుబాటులో ఉంటా. నా అనుభవాలను పంచుకుంటా. ఇక్కడ గత పర్యటనల్లో నేర్చుకున్న అంశాలను వారికి చెబుతా. సింపుల్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా. అదే వారికీ చెబుతుంటా. ప్రతి విషయంలోనూ కలగజేసుకొని వారికి మరీ ఎక్కువగా చెప్పేయను. నా టెక్నిక్, నా బౌలింగ్ విధానం వారితో పోలిస్తే విభిన్నం. కాబట్టి నేను ఇచ్చే సూచనలు ఒక్కోసారి వర్కౌట్ కాకపోవచ్చు" అని బుమ్రా వ్యాఖ్యానించాడు. "లార్డ్స్ ఆనర్స్ బోర్డులో పేరు ఎక్కడం చాలా సంతోషంగా ఉంది. ప్రతిసారీ కెమెరాలు మనపైనే ఉంటాయి. ప్రాక్టీస్ చేస్తున్నా చుట్టూ ఓ కన్నేసి ఉంటాయి. ఇప్పుడున్న వ్యూస్, సబ్‌స్క్రైబర్ల తరంలో ప్రతిఒక్కరూ తమకంటూ సంచలనం సృష్టించాలని కోరుకుంటారు. వాటిని ఆపడం నా చేతుల్లో లేదు. భారత జెర్సీ వేసుకున్నా, లేకపోయినా మనల్ని జడ్జ్ చేసేవాళ్లు ఉంటారు. ప్రతి క్రికెటర్‌కు ఇది తప్పదు. నేను టీవీల్లో కనిపిస్తున్నంత కాలం గమనించేవాళ్లూ ఉంటారు. సచిన్ తెందూల్కర్ 200 టెస్టులు ఆడినా.. ఇప్పటికీ ఆయనపై చాలామంది తమ అభిప్రాయాలను చెబుతూనే ఉంటారు" అని భారత పేసర్ తెలిపాడు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143